22వ వార్డులో డ్రైనేజీపై దశరథం ఫోకస్




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

పరకాలలో 28న హిందూ ధర్మ సమ్మేళనం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 116 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 23 ఏప్రిల్ 2026


# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

- ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు
- ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన



**హైదరాబాద్,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు.వివిధ రంగాలలో మిగతా2లో...

# ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు

- వివరణ కోరిన కేంద్ర ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'టెర్రరిస్టు' అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసు పంపింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నందున ఆయనపై చర్య తీసుకోవాలని, మిగతా2లో...

# కాళేశ్వరం కథ ముగియలేదు

● సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు ● బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో..? ● మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు మిగతా2లో...



# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

- 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- బెంగాల్లో 152 స్థానాలకు తొలి విడత పోలింగ్ ఏర్పాట్లు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అలాగే బెంగాల్లో తొలిదశ పోలింగ్ జరుగనుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది సరంజామాతో తమకు అప్పగించిన కేంద్రాలకు చేరుకున్నారు. తమిళనాట మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మిగతా2లో...

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు



- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్

**హైదరాబాద్,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం మిగతా2లో...

# కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలొద్దు
- సీబీఐ దర్యాప్తు కూడా చేయొద్దు
- కాళేశ్వరంపై హైకోర్టు కీలక తీర్పు



**హైదరాబాద్,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని తేల్చి చెప్పింది. అలాగే ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను కలిపి ఉమ్మడిగా తీర్పు వెలువరించింది. పిటిషనర్లపై కమిషన్ నివేదిక ఆధారంగా మిగతా2లో...

# తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

- ములుగు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షం



**హైదరాబాద్,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు , వడగళ్ల వాన తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా తెలంగాణలోని ములుగు, ఏపీలోని నంద్యాల జిల్లాలో కురిసిన వానకు సామాన్య ప్రజలతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో మిగతా2లో...

# రెండు రాష్ట్రాల్లో భారీగా నగదు, మద్యం, నగలు పట్టివేత

- దాదాపు వేయికోట్ల విలు వుంటుందని ఇసి వెల్లడి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ధనం, మద్యం, ఉచితాలతో ఓటర్లను ప్రలోభపెడుతుండటం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ప్రలోభాలపై ఈసీ దేగకన్ను వేస్తుంటుంది. తాజాగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1,000 కోట్లకు పైగా విలువచేసే నగదు, మద్యం, డ్రగ్స్, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మిగతా2లో...




# ఆరుగురు ఐపిఎస్‌లకు డిజి హోదా

**హైదరాబాద్,22(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో పని చేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీ ఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్‌కుమార్, సజ్జనార్‌కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# 'ఓటుకు నోటు'ను క్రిమినల్ కేసుగా పరిగణించొద్దు

- సుప్రీంను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్నికల చట్టాల ప్రకారం విచారించాలని విన్నపం
- తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా



**హైదరాబాద్,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఈ కేసును క్రిమినల్ కేసుగా పరిగణించవద్దని ప్రధాన నిందితుడైన సీఎం రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు మంగళవారం సుప్రీంకోర్టును కోరారు. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల కింద విచారించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో రేవంత్‌రెడ్డి పిటిషన్‌తోపాటు ఇదే కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ మరో నిందితుడు సండ్ర వెంకటవీరయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై రెండు వారాల తర్వాత విచారణ మిగతా2లో...

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి



**హైదరాబాద్,22(పిసిడబ్ల్యూ న్యూస్):** చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా మిగతా2లో...

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెల్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందిగా ఆదేశించాలని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈసీకి బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే వివరణ కోరుతూ ఎన్నికల కమిషన్ నోటీసు ఇచ్చింది. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని బీజేపీ ప్రతినిధుల బృందంలోని నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈసీకి ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో పాటు భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 175 కింద నేరమవుతుందని, పరువునష్టం కేసు వేసేందుకు అవసరమైన ప్రాథమిక సాక్ష్యంగా ఆయన వ్యాఖ్యలు నిలుస్తాయని ఈసీ దృష్టికి తెచ్చారు. అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై ఖర్గే తమిళనాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందని ప్రశ్నించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని విమర్శించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించడంతో ఆయన తిరిగి వివరణ ఇచ్చారు. మోదీని తాను ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదని, ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. మీడియాతో కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ఈసీఐని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కలిసినట్టు చెప్పారు. ఎంతో బాధ, ఆగ్రహంతో తాము ఇక్కడకు వచ్చామన్నారు. ప్రధానమంత్రి మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అవమానించిన తీరే ఇందుకు కారణమని అన్నారు. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. దీనికి ముందు, ఖర్గే వ్యాఖ్యల వివాదంపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఒక లేఖ రాసింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం కిందకు వస్తుందని పేర్కొంది.

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)


మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమాస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్‌పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. కొత్తగా సినీన టుడు విజయ్ టివికె పార్టీ కూడా అదృష్టాన్ని పరీక్షిం చుకోబోతోంది. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతాని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజక వర్గాల నుంచి పోటీలో నిలిచారు. పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్ల మంది పురుషులు, 1.75 కోట్ల మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది. 2021 నాటి పరిస్థితులకు భిన్నంగా ఈసారి తృణమూల్, భాజపాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నా యి. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. విజయం నల్లేరు మీద నడకలా కనిపించడం లేదు.

# కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

సీబీఐ దర్యాప్తుతో పాటు ఇతర చర్యలేవీ తీసుకోరాదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చట్టబద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కమిషన్ విచారణ తీరు చట్టబద్ధంగా లేదని తేల్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే...పిటిషనర్లు కేసీఆర్, హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషిలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గత ఏడాది జులై 31న ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు చేయరాదని హైకోర్టు గతేడాది సెప్టెంబర్ 2న మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. బుధవారం వెలువడిన తీర్పు ప్రకారం మధ్యంతర ఉత్తర్వులు తుది ఉత్తర్వుల య్యాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గురైందని చెప్పి ప్రభుత్వం జస్టిస్ ఘోష్ కమిషన్‌తో విచారణకు ఆదేశించడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ఉందని వెల్లడించింది.ఈ క్రమంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిజనిర్ధారణ మాత్రమే చేయాలనీ, ఎవరు తప్పు చేశారో చెబుతూ వాళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనే ధోరణిలో నివేదిక ఇవ్వడాన్ని ఆక్షేపించింది. కమిషన్ విచారణ సమయంలో సాక్షులు ఇచ్చిన సమాచారాన్ని, ఆధారాలను పరిశీలించాక ఎవరిపైన అయినా అభియోగాలు ఉన్నాయని భావిస్తే.. సదరు సాక్షికి ఆ వివరాలు, అభియోగాలు తెలియజేసి వివరణ తీసుకోవాలన్న కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి), 8(సి) సెక్షన్ల నిబంధనలను అమలు చేయలేదని తప్పుపట్టింది.కమిషన్ ఈ ఏడాది జులై 31న ఇచ్చిన రిపోర్టుతో సంబంధం లేకుండా సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తున్నామని ప్రభుత్వం చెబుతూనే రిపోర్టులోని అంశాలను సీబీఐ దర్యాప్తు కోరుతూ వెలువరించిన నోటిఫికేషన్‌లో ప్రస్తావించడాన్ని తప్పుపట్టింది. తీర్పు ప్రతి ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. బెంచ్‌పై చీఫ్ జస్టిస్ మూడు వ్యాఖ్యల తీర్పు సారాంశాన్ని వెలువరించారు. పిటిషన్లను పాక్షికంగా అనుమతిస్తున్నట్టు ప్రకటించారు.

**కాళేశ్వరంపై హైకోర్టు ఎవరికి క్లీన్ చిట్ ఇవ్వలేదు సీబీఐ విచారణకు కోర్టు తీర్పు అడ్డంకి కాదు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి** కాళేశ్వరంపై హైకోర్టు ఎవరికి క్లీన్ చిట్ ఇవ్వలేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. "జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కొట్టేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కానీ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదు. కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించింది. జ్యుడీషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. బుధవారం వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదు" అని ఉత్తమ్ పేర్కొన్నారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తరువాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



# కాళేశ్వరం కథ ముగియలేదు

(మొదటి పేజీ తరువాయి)

తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమీషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# రెండు రాష్ట్రాల్లో భారీగా నగదు, మద్యం, నగలు పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమబెంగాల్‌లో రూ.472.89 కోట్లు, తమిళనాడులో రూ.599 కోట్లు విలువచేసే నగదు, మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, ఉచితాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. ఇందులో రూ.127.67 కోట్ల నగదు, రూ.106.3 కోట్ల విలువైన మద్యం, రూ.184.83 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.215.19 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.437.97 కోట్ల విలువైన ఇతర ఉచితాలు ఉన్నట్టు ఈసీ తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 23న జరుగనుంది. తమిళనాడులో ఒక విడతలో పోలింగ్ జరుగనుండగా, బెంగాల్‌లో రెండు విడతలుగా జరుగునుంది. అక్కడ రెండో విడత పోలింగ్ ఈనెల 29న ఉంటుంది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో పాటు ఇప్పటికే పోలింగ్ పూర్తయిన అస్సాం, కేరళ, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

# 'ఓటుకు నోటు'ను క్రిమినల్ కేసుగా పరిగణించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

జరుపనున్నట్టు జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ప్రకటించింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఇదేవిధమైన మరో కేసుపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాల్సి ఉన్నదని, ఆ తీర్పు వచ్చాక అందులోని వివరాలను పరిశీలించి 'ఓటుకు నోటు' కేసును విచారిస్తామని తెలిపింది.

# తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

కూడిన వడగళ్ల వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో భారీగా వడగళ్ల వాన కురిసింది. గాలుల ధాటికి పలు గ్రామాల్లో ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ప్రజలు భయంభ్రాంతులకు గురయ్యారు. ఏటూరునాగారం – కమలాపూర్ మార్గంలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేతికి వచ్చే దశలో ఉన్న మిర్చి, వరి పంటలు వడగళ్ల వానకు దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నంద్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలివాన ధాటికి వందల ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలపాలు కావడంతో రైతులు భారీగా నష్టపోయారు. రుద్రవరం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నేలకూలిన విద్యుత్ తీగలు, స్తంభాలతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. వాటిని తాకవద్దని అధికారులు సూచించారు. పంట నష్టపోయిన రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలిపాలని, ప్రభుత్వం నుంచి అందే సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. రాబోయే కొన్ని గంటల్లో మళ్లీ వర్ష సూచన ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పు తోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియో గిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

# నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును వేగంగా ఢీకొన్న కారు: ముగ్గురు దుర్మరణం




**నల్గొండ,ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు.. బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శాకాజిపురానికి చెందిన బాల్‌రెడ్డి, అలివేలు, పాల్వాయి గ్రామానికి చెందిన మంజుల, వెంకటమ్మ నల్గొండలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వద్దిరెడ్డిగూడెం సమీపంలో అతి వేగం కారణంగా కారు ప్రమాదానికి గురైంది. ఓ బైకును ఢీకొట్టి కారు అదుపుతప్పింది. ఆ వెంటనే ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కనగల్‌కు చెందిన మధుబాబు, ధనుంజయ అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఉన్న బాల్‌రెడ్డి కూడా సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికులు ప్రమాదం గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

**• జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జి**




**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 22(పిసిడబ్ల్యూ న్యూస్):** మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, యువతకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్ జి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యువత, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా పోలీస్, ఎక్సైజ్ మరియు విద్యాశాఖలు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, గ్రామ, మండల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ములుగు సామాజిక ఆసుపత్రి లో ప్రత్యేకంగా డి అడిక్షన్ కేంద్రం అందుబాటులో ఉందని మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో సైకాలజిస్ట్ లతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సిద్ధార్థ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డీఏఓ, డీసీఓ, కలెక్టరేట్ పర్యవేక్షకుడు మహేష్ బాబు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ఘనంగా సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవం

**లెనిన్ జయంతి సందర్భంగా విప్లవ స్ఫూర్తితో మహబూబాబాద్‌లో సభ**



**మహబూబాబాద్, ఏప్రిల్ 22(పి.సి.డబ్ల్యూ న్యూస్):** జిల్లా కేంద్రంలోని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ 156వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి. సనప పొమ్మన్న జెండాను ఆవిష్కరించగా, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా విప్లవోద్యమ చరిత్రను విశదీకరించారు. ఆయన మాట్లాడుతూ 1870లో లెనిన్ జన్మదినం రోజున సిపిఐ (ఎం-ఎల్) పార్టీ స్థాపన భారత రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం అనంతరం నక్సల్బరీ ఉద్యమం ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని రగిలించిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటాలు సామాన్య ప్రజల జీవితాల్లో మార్పులకు దారితీశాయని వివరించారు. పగిడేరు ఘటనతో ప్రారంభమైన సాయుధ పోరాటం గోదావరి లోయలో ప్రతిఘటనా పోరాటాలుగా విస్తరించిందని, ఈ పోరాటాల ఫలితంగానే ఆదివాసీలు లక్షల ఎకరాల భూములను సాగు చేసుకునే హక్కును పొందారని తెలిపారు. అటవీ హక్కుల చట్టం, పేసా చట్టం వంటి నిర్ణయాలు ప్రజా ఉద్యమాల ఒత్తిడితోనే సాధ్యమయ్యాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు అభివృద్ధి చెందడంలో కూడా ఈ పోరాటాల పాత్ర ఉందని గుర్తుచేశారు. ఇటీవలి కాలంలో విప్లవోద్యమం కొంత వెనుకంజ వేసినప్పటికీ, రివిజనిజం, మితవాద ధోరణులు పెరగడం ప్రధాన సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు. విప్లవ పంథాను వదిలి పార్లమెంటరీ విధానాలకు మళ్లే ధోరణిని తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించిన ఆయన, ఆదివాసీ ప్రాంతాల్లో సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించడం వల్ల స్థానిక ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాలను అణచివేయడం, కార్యకర్తలను నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సభలో పాల్గొన్న నాయకులు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, విప్లవ పంథాను మరింత బలోపేతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం ముగింపులో "ప్రతిఘటనా పోరాటాలు వర్ధిల్లాలి", "వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి" దున్నేవాడికే భూమి కావాలని వంటి నినాదాలతో సభ ఉత్సాహంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, పి ఓ డబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందా అరుణ, పి ఓ డబ్ల్యు రాష్ట్ర నాయకులు భాగ్యలక్ష్మి, ఏఐకేఎంఎస్ నర్సిరెడ్డి, సట్ల యాకయ్య, వీరన్న, పి వై ఎల్ నాయకులు గుగులోతు గణేష్, భావన ఋషి, పిఓడబ్ల్యూ నాయకురాలు అనురాధ, రేఖ, శ్రీనివాస్, కసేనబోయి కొమరయ్య, బానోతు బాలు, గుడేల్ లక్ష్మి, గూడెల్ అప్పలమ్మ, మద్దునూరి కోమల, జన్ను శ్రావణి, డొనక సోమక్క, డొనక ఎల్లమ్మ, ముక్కలపల్లి వెంకన్న, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ట్రంక్ టన్నల్ పనులపై ఉన్నతస్థాయి పరిశీలన

**నిర్దిష్ట గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు**





**సత్తుపల్లి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో యాతలకుంట గ్రామంలో కొనసాగుతున్న ట్రంక్, టన్నల్ నిర్మాణ పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వ్యవసాయ శాఖ మంత్రివర్యులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమగ్రంగా సమీక్షిస్తూ, ప్రాజెక్ట్ అమలులో ఉన్న వివిధ అంశాలపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు. ముఖ్యంగా నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు మరియు పనుల వేగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, కార్మికుల భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే ప్రాజెక్ట్ పనులను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పనుల ఆలస్యంపై బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ ప్రాజెక్ట్ ప్రాంతీయ అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో ఈ పనులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు.

# వివాహా వార్షికోత్సవం సందర్భంగా మజ్జిగ దానం ఆదర్శంగా నిలిచిన నిర్మలమోహన్ రెడ్డి దంపతులు



**కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ... సర్పంచ్ దంపతుల సేవాభావానికి ప్రశంసలు**



**కల్లూరు, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో పేరువంచ గ్రామ సర్పంచ్ కీసర నిర్మలమోహన్ రెడ్డి దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో గుర్తుండిపోయేలా జరుపుకున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించేందుకు కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులు మరియు ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పేరువంచ యూత్ కాంగ్రెస్ నాయకులు జొనబోయిన గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ప్రజలకు సుపరిచితులైన కీసర నిర్మల, మోహన్ రెడ్డి దంపతులు ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా టీం సత్తుపల్లి తరపున, ప్రయాణికుల తరపున, కల్లూరు ప్రజల తరపున దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి వేడుకలు మరెన్నో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఈ సేవా కార్యక్రమానికి ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

## 22వ వార్డులో డ్రైనేజీపై
# దశరథం ఫోకస్

**• పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**



**పరకాల, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని 22వ వార్డులో మసీదు ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. మసీదు పెద్దల విజ్ఞప్తి మేరకు స్థానిక కౌన్సిలర్ అల్లే దశరథం, మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఏఈ రంజిత్ కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రాంతంలో నిల్వ నీరు, మూసుకుపోయిన కాలువల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పరిస్థితిని సమీక్షించిన అధికారులు, డ్రైనేజీ సమస్యను అత్యవసరంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా మున్సిపల్ యంత్రాంగం స్పందించడం పట్ల స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# పరకాలలో 28న హిందూ ధర్మ సమ్మేళనం



**పరకాల, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలో ఈనెల 28వ తేదీ మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో (పశువుల సంత) నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి ఉపాధ్యక్షుడు మాడుగుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ దేవస్థానం ఛైర్మన్ గందే వెంకటేశ్వర్లును హిందూ సమ్మేళనం నిర్వాహకులు శాలువాతో సత్కరించి, కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూడ హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి, ఐక్యపరచడం ద్వారా దేశాన్ని తిరిగి విశ్వగురువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే హిందువుల ఐక్యత అత్యవసరమని పేర్కొన్నారు. హిందూ సమాజంలో గౌరవం, సేవాభావం, సంస్కృతి పరిరక్షణ వంటి విలువలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహత్తర సమ్మేళనంలో హిందువులు భారీగా పాల్గొని ఐక్యతను చాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ఐఐటి/జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో గిరిజన గురుకులాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ

**• గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త పి. రత్నకుమారి**



**మహబూబాబాద్, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** గిరిజన గురుకులాల విద్యార్థులు ఐఐటి/జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త పి. రత్నకుమారి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో దామరవంచ టిజిటిడబ్ల్యూఆర్జెసి (బాయ్స్) చెందిన గుగులోతు శేఖర్ 90% పర్సంటైల్ తో ఎస్టి విభాగంలో 1593 ర్యాంకు ఈఎంఆర్ఎస్ సిరోల్ కు చెందిన నందిని 88%, ఈఎంఆర్ స్ గూడూర్ కు చెందిన లూనావత్ ఝాన్సీ 78% సాధించారన్నారు. జేఈఈ మెయిన్స్ లో ప్రశంసనీయమైన విజయం రావడంతో ఆర్ సి ఓ. మరియు అధ్యాపకులను విద్యార్థులను అభినందించారు.

# ఎస్ఆర్ఎల్ఐపి పనుల వేగం పెంచండి: సబ్ కలెక్టర్ ఆదేశాలు

**లోపాలపై దృష్టి... గడువులో లక్ష్యాలు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం**



**కల్లూరు, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎస్ఆర్ఎల్ఐపి పనుల పురోగతిపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పనుల స్థితిగతులను సవివరంగా పరిశీలించిన ఆయన, జరుగుతున్న పనుల్లో ఉన్న లోపాలను గుర్తించారు. పనుల పురోగతిని వేగవంతం చేయడంతో పాటు నిర్ణీత గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ పనుల నాణ్యతను మెరుగుపరచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అవసరమైన వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సమయానికి సాధించేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని మార్గదర్శకాలు జారీ చేశారు. ఎస్ఆర్ఎల్ఐపి పనులు ప్రజలకు ప్రయోజనం చేకూరేలా వేగంగా పూర్తి చేయడం అత్యంత ముఖ్యమని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

## "కవ్వంపల్లికి కృతజ్ఞతలు తెలిపిన "దావు"



**తిమ్మాపూర్,ఏప్రిల్22(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీకి చెందిన దావు సంపత్ రెడ్డి మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం హైదరాబాద్ లో డాక్టర్ కవ్వంపల్లి నివాసానికి వెళ్లిన దావు సంపత్ రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించిన పార్టీ కరీంనగర్ జిల్లా కమిటీలో సంపత్ రెడ్డికి చోటు లభించింది. ప్రాముఖ్యంగల జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి రావడంపై సంపత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ తన పేరును సిఫారసు చేసిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను హైదరాబాద్ లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగూరి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాచర్ల శ్రీనివాస్, మొండయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విషాద కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ







**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలో పలువురు ఆత్మీయుల మృతి పట్ల తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం పాత అగ్రహారంలో ఆళ్ళ వెంకటరెడ్డి, బోనకల్ రోడ్డులో హెడ్ కానిస్టేబుల్ పోలగాని శ్రీనివాసరావు, శ్రీరామ్ హిల్స్‌లో కార్పొరేటర్ కమర్తపు మురళి తల్లి బతుకమ్మ కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గాదె వాసుదేవరెడ్డి దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించారు.

## నేడు, రేపు హైదరాబాదులో ఎన్‌యుజె(ఐ)జాతీయ మహాసభలు

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఏప్రిల్ 22(పీసీడబ్ల్యూ న్యూస్):** నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా)ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 23, 24 తేదీలలో నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్ హోటల్ శ్రీ వేద ప్రీమియంలో ఏర్పాటు చేసినట్లు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం నారగౌని, తోకల అనిల్ కుమార్, ఎన్ యు జె (ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ తెలిపారు. జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా 23వ తేదీ ఉదయం 10 గంటలకు 'తెలంగాణ రైజింగ్: ప్రోగ్రెస్ జర్నీ – మీడియా విట్నెస్' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వివరించారు. అదేవిధంగా ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ విశిష్ట అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. రెండు రోజులపాటు జరుగనున్న జాతీయ కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## రైతులు ధాన్యపు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ ● రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి ● వెంటనే కాశీటాలు నిర్వహించి రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసేవిధంగా చూడాలని కోరారు ● రైతు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్ 22(పి.సి.డబ్ల్యూ న్యూస్):** రైతాంగం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం అందించే మద్దతు ధరతో ధాన్యం విక్రయించూ కోవాలని మార్కెట్ కమిటి చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ , ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. ఆంధ్ర బ్యాంకు సొసైటీ ఆధ్వర్యం నేరడ గ్రామంలో ధాన్యపు కొనుగోలు కేంద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, సర్పంచ్ ఇరుగు గౌతమి, ఆలయ చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యపు కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని , వెంటనే కాశీటాలు నిర్వహించి రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసేవిధంగా చూడాలని కోరారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, వేణుగోపాల్ రెడ్డి,రామునాయక్, ఏ ఓ నరసింహ రావు,బ్యాంకు యం డి, జితేందర్ ,రజినీకాంత్ కృష్ణా రెడ్డి, పోలేపాక వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న.. పేద ఆడబిడ్డ వివాహానికి 10,116 కానుక అందజేత



**గంగాధర ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గంగాధరలో ఈరోజు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహానికి తన వంతుగా 10,116 ఆర్థిక సాయం అందజేస్తానని గతంలో ఆయన ప్రకటించినందునఈ క్రమంలో, నేడు గంగాధర గ్రామానికి చెందిన గంగాధర పోచమలయ్య గారి కుమార్తె అయిన ఎలాగందుల చంద్రకళ – కొండయ్య కుమార్తె వందన వివాహ వేడుకకు సర్పంచ్ గారు ముందస్తుగా స్వయంగా హాజరయ్యారు. నూతన వదువును ఆశీర్వదించిన అనంతరం, వధువు కుటుంబానికి 10,116 నగదును పెళ్లి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న మాట్లాడుతూ"గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉండటమే నా లక్ష్యం. ముఖ్యంగా ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదని, నేను ఇచ్చిన మాట ప్రకారం ఈ చిన్న సహాయాన్ని అందిస్తున్నాను. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నా వంతు కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## కల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శనకు మాజీ ఎమ్మెల్యే సండ్ర

● పుల్లయ్యబంజర ఐకేపీ సెంటర్‌లో రైతులతో సమావేశం... అనంతరం విలేకరుల సమావేశం

**కల్లూరు, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్యబంజర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని (ఐకేపీ) బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య గురువారం ఉదయం 10 గంటలకు సందర్శించనున్నారని బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు పరిస్థితులను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కల్లూరు మున్సిపాలిటీ మరియు మండల పరిధిలోని రైతులు, బీఆర్ఎస్ పార్టీ తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పార్టీ నాయకులను కోరారు. ఈ కార్యక్రమానికి అందరూ సకాలంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## డ్రాయింగ్ బుక్స్, స్కెచ్ పెన్నులు, కుక్కర్‌ను అందించిన కార్పొరేటర్ మాసం గణేష్...






**కరీంనగర్,ఏప్రిల్22(పీసీడబ్ల్యూ న్యూస్):** ఐసిడిఎస్ పోషన్ పక్వాడలో భాగంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు కోతి రాంపూర్ సెక్టార్, పోచమ్మ వాడ అంగన్వాడి సెంటర్లో డొనేషన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ మాసం గణేష్ కార్పోరేటర్ హాజరై డొనేషన్ డే ను పురస్కరించుకొని పిల్లలకు డ్రాయింగ్ బుక్స్, స్కెచ్ పెన్నులు, అంగన్వాడి కేంద్రంలో వంటకు అవసరమైన కుక్కరు ను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలు పిల్లల భవిష్యత్ కోసం ఎంతో అవసరమని , పిల్లలను క్రమంగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల పనితీరు అభినందనీయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్వైజర్ ఎస్ అరుణ మాట్లాడుతూ అంగన్వాడీలో పిల్లలు ఆటపాటల ద్వారా విద్య నేర్పిస్తారని, అంగన్వాడీ కేంద్రాలు ప్రైవేటు కంటే దీటుగా పనిచేస్తున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలన అంగన్వాడి కేంద్రానికి పంపించాలని సూచించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో లభిస్తున్న అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రోగ్రాంలో అంగన్వాడి టీచర్ సరూప, ఆయా, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు .

## ఆక్రమణలు తొలగించండి... లేకపోతే కఠిన చర్యలు...!

● కల్లూరు మున్సిపాలిటీ హెచ్చరిక

● 7 రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించకపోతే ఫైన్లు, చర్యలు తప్పవు



**కల్లూరు, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణంలో ప్రధాన రహదారుల వెంట డ్రైన్లపై, రోడ్లపై ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, తోపుడు బండ్లు, అనుమతి లేని ప్రచార బోర్డులను వెంటనే తొలగించాలని కల్లూరు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ దుకాణ యజమానులకు ఘాటుగా హెచ్చరించారు. పాదాచారులు సౌకర్యంగా నడవడానికి, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 200 మంది షాప్ యజమానులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలపై స్పష్టమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. నోటీస్ అందిన 7 రోజుల్లోపు స్వయంగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేకపోతే మున్సిపాలిటీ సిబ్బంది స్వయంగా తొలగించి భారీ జరిమానాలు విధిస్తారని మున్సిపల్ మేనేజర్ నాగేశ్వర్ రావు స్పష్టం చేశారు. అలాగే అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటనల బోర్డులను కూడా తొలగించి, మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణాన్ని శుభ్రంగా, సురక్షితంగా ఉంచడంలో అందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## హర్యాతండాలో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యానికి శ్రీకారం మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం





**రఘునాథపాలెం, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం హర్యాతండా గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటి అందుబాటును పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. ఆగ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన నూతన మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను సర్పంచ్ బానోత్ స్వాతి రమేష్ గారు ఘనంగా ప్రారంభించారు. 3వ వార్డు మెంబర్ వాంకుడోతు శివలాల్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు సులభంగా అందుబాటులోకి రానుంది. కార్యక్రమానికి గ్రామ సెక్రటరీ బోడ రాము, 6వ వార్డు మెంబర్ అజ్మీర శాంత వెంకయ్య, 8వ వార్డు మెంబర్ శైలజ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, యువత మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వాతి రమేష్ గారు మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడం తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఈ వాటర్ ప్లాంట్ గ్రామ ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సదుపాయం ప్రారంభం కావడంతో హర్యాతండా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ, గ్రామ అభివృద్ధి దిశగా ఇది మరో ముఖ్యమైన అడుగు అని అభినందించారు.



# తొర్రూర్ బస్ డిపోలో విజయవంతమైన ఆర్టీసీ సమ్మె

**● శాంతియుతంగా సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ● బస్సులను బయటకు తీసేందుకు ప్రయత్నించిన డి ఎం కు సహకరించని కాంట్రాక్ట్ బస్సు డ్రైవర్లు ● సమ్మెలో పాల్గొన్న డ్రైవర్, కండక్టర్లకు మద్దతు పలికిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ● బస్ డిపో ఎదురుగానే వంట వార్పు కార్యక్రమంపర్పాటు.**









**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 22(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22న ఆర్టీసీ సమ్మె చేయటం జరుగుతుందని ముందస్తుగానే ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు తెలియపరచామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరినట్లు సమ్మెకు దిగిన ఉద్యోగస్తులు పేర్కొన్నారు. ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు తెల్లవారి 3 గంటల నుండి బస్సు డిపో ఎదురుగా కూర్చోవడం జరిగిందని డ్రైవర్, కండక్టర్లు పేర్కొన్నారు. ఈ సమ్మెలో ఎలాంటి అలజడి లేకుండా శాంతియుతంగా పాల్గొన్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో తెలిపిన దాని ప్రకారమే ఆ హామీలను నెరవేర్చాలని కోరుతున్నామని అదనముగాఎలాంటి డిమాండ్లను మేము అడుగుతలేమని సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికులు తెలియపరిచారు. తొర్రూరు బస్ డిపో నుండి ఔట్సోర్సింగ్ డ్రైవర్ ,కండక్టర్లతో బస్సులను నడిపేందుకు ప్రయత్నించిన పద్మావతి కి నిరాశ ఎదురయిందని సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ డ్రైవర్ ,కండక్టర్లకు మద్దతుగా ఔట్సోర్సింగ్ డ్రైవర్లు మద్దతు పలికారు. దీనితో బస్సులను బయటకు తీసేందుకు వీలుపడలేదు. ఎలాంటి అలజడి లేకుండా డి.ఎస్.పి, సీఐ, ఎస్ఐలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగస్తులు అందరూ బయటకు వెళ్లకుండా డిపో ఎదురుగానే వంటావార్పు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం వరకు ఏ ఒక్క బస్సు కూడా బయటికి వెళ్లలేదని ఈ సమ్మె శాంతియుతంగా విజయవంతమైనట్లు వారు పేర్కొన్నారు. బుధవారం రోజు చర్చలు కొనసాగి అందులోని డిమాండ్లు సఫలం అయితే గురువారం నుండి బస్సులు నడిచే అవకాశం ఉందని లేనిపక్షంలో ఎన్ని రోజులైనా సరే సమ్మెలో పాల్గొంటామని వారు పేర్కొన్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాహనాలు బస్టాండ్ నిండా ప్రయాణికుల కోసం వేచి ఉన్నారు. కారులో హైదరాబాదుకు 500 రూపాయలు. టాటా ఏసీ మహబూబాబాద్ కు 100 రూపాయలు, ఆటోలు రోజుగా నడిచే కిరాయి పైన పది రూపాయలు పెంచి నడిపించారు. ఖమ్మం, హనుమకొండ, వరంగల్, సూర్యపేట డిపోలకు చెందిన మూడు నాలుగు బస్సులు తిరగటంతో కొందరు ప్రయాణికులకు ఊరట కలిగించినట్లు అయిందని ప్రయాణికులు పేర్కొన్నారు. హైదరాబాద్ కు వెళ్లాల్సిన ప్రయాణికులు మాత్రం తప్పనిసరిగా వెళ్లేవారు ఐదు వందల రూపాయలు ఇచ్చి ప్రైవేట్ కార్లు బయలుదేరి వెళ్లారు. ఆర్టీసీ సమ్మెను విరమింప చేసి నేటి నుండి బస్సులు నడిపించే విధంగా చూడాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వాలతో చర్చలు జరిపి బస్సులు నడిపే విధంగా చూడాలన్నారు. నేటి నుండి బస్సులు నడవకపోతే ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికులను దోచుకునే అవకాశాలు ఉన్నాయని బస్సులను త్వరగా నడిపి ఆలోచన చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలి: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

**తిరుపతి ఏప్రిల్ 22(పిసీడబ్ల్యూ న్యూస్):**నగరంలోని అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను బుధవారం మధ్యాహ్నం ఇంచార్జి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఒక్కొక్కరికి ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

## శ్రీ రేహునుమ ఈ టెక్నో హైస్కూల్ ఘనంగా వార్షిక వేడుకలు

**రామాపురం ఏప్రిల్ 22(పిసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని గువ్వల చెరువు శ్రీ రేహునుమా ఈ టెక్నో స్కూల్ లో బుధవారం విద్య సంవత్సరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లితండ్రులు ఉపాధ్యాయులు అందరూ కూడా భాగ్య సమమై ఘనంగా నిర్వహించారు యజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సలహాలు సూచనలు తీసుకొని విద్యార్థులు దినాభివృద్ధిగా నడపబోతున్న వంటి విద్య సంస్థలో విద్యార్థుల యొక్క తరగతి దూసుకు వెళుతున్నా శ్రీ రేహునుమా ఈ టెక్నో ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ రెహునుమా, హెడ్మాస్టర్ షేక్ దర్బార్ షావలి ఉపాధ్యాయులు శివశంకర్,కృష్ణవేణి, భాగ్య, నజిమా,అస్పియా, శ్రీలక్ష్మి ఇమ్రాన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో విద్యార్థులకు అందిస్తున్న సహకారం పట్ల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలపారు

## వారంలోగా ఉపాధి హామీ బకాయిల చెల్లింపు: ఏపీవో నరసింహులు

**సిద్ధవటం ఏప్రిల్ 22(పిసీడబ్ల్యూ న్యూస్):-** జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని ఏపీవో నరసింహులు తెలిపారు. బుధవారం సిద్ధవటం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కూలీల వేతనాల కోసం బడ్జెట్ విడుదల చేసిందని, గత 6 నెలలుగా ఆగిన వేతనాలు వారం రోజుల్లోపు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. చెల్లింపుల విషయంలో కూలీలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ డబ్బులు అందుతాయని ఆయన స్పష్టం చేశారు

# పుట్టుకతో వికలాంగుడైన ఓదెల నరేష్ 2011 నుండి ఇప్పటి వరకు అనేక రకాల కవితలు రాస్తు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాడు

**బుధవారం రోజున నువ్వు-నేను అని కవిత రాసి పోస్ట్ చేయక తెగ వైరల్ గా మారింది.**

**ఇతడిని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం గుర్తించి వికలాంగుడైన ఓదెల నరేష్ కు స్పెషల్ కేసు కింద ఉద్యోగం కల్పించాలని కోరుతున్నాము.**



**గంగాధర ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబానికి చెందిన ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ డిగ్రీ &ఐటీఐ వరకు చదువుకున్నాడు ఇప్పటికీ అనేక రకాల పోటీ పరీక్షలు రాసిన ఏనాడు విజయం దక్కలేదని కన్నీరు మిన్నీరు అయ్యాడు గత కొన్ని రోజుల క్రితం గ్రూప్ 4 పరీక్ష రాయగా మూడు మార్కులతో విజయం దక్కలేదని మనో ధైర్యాన్ని కోల్పోయాడు ఇప్పటికీ అనేక రకాల పోటీ పరీక్షలు రాసిన ఏ నాడు విజయం దక్కలేదని కన్నీరు మున్నీరయ్యాడు ఇప్పటికీ అనేక రకాల కవితలు రాస్తూ ఇప్పటికీ చాలా అవార్డులు హైదరాబాద్ రవీంద్రభారత్ లో ఢిల్లీలో తమిళనాడులో చాలా అవార్డులు తీసుకున్నారని వికలాంగుడు కోరుతున్నాడు తాను చిన్నతనం నుండే అనేక రకాల కవితలు రాస్తు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాడు వికలాంగుడు అయినా ఓదెల నరేష్ ను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జిల్లా యంత్రాంగం గుర్తించి ఇతడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కాబట్టి స్పెషల్ కేస్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ వికలాంగుడిని గుర్తించి ఏదైనా చిన్నపాటి ఉద్యోగం స్పెషల్ కేసు కింద కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర యంత్రాంగాన్ని శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని ప్రభుత్వశీ పక్షాన జిల్లా యంత్రాంగం తరుపున కోరుతున్నట్టు వికలాంగుడు తెలిపారు.

# రాళ్లకుంట చెరువు శిఖం భూమిపై అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

**● తహశీల్దార్ జి. జగదీశ్వర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది దూకుడు రేకుల షెడ్డులు పూర్తిగా తొలగింపు**




**ములుగు జిల్లా, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఏటూరు నాగారం మండలం:మండల తహశీల్దార్ జి. జగదీశ్వర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది కఠిన చర్యలు చేపట్టారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆకులవారి ఘనపురం రెవెన్యూ గ్రామ శివారులో గల రాళ్లకుంట చెరువు శిఖం భూమిపై అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డులపై అధికారులు ఉక్కుపాదం మోపారు.తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, చెరువు శిఖం భూమిని ఆక్రమించి నిర్మించిన అన్ని షెడ్డులను పూర్తిగా కూల్చివేశారు. ఈ చర్యతో చెరువు భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా తహశీల్దార్ జి. జగదీశ్వర్ మాట్లాడుతూ, చెరువులకు సంబంధించిన శిఖం భూములు ప్రభుత్వ ఆస్తిగా ఉండి ప్రజా ప్రయోజనాలకు అత్యంత కీలకమని తెలిపారు. ఇటువంటి భూములను ఆక్రమించడం చట్ట విరుద్ధమని, ఎలాంటి వ్యక్తులైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం అసలు సహించబోమని గట్టిగా హెచ్చరించారు.అలాగే ఎమ్మార్వో మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కాపాడటం తమ బాధ్యత అని, ఎవరైనా అక్రమంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొందరు పట్టించుకోకపోవడంతో ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు.ఇకపై కూడా ఇలాంటి అక్రమ నిర్మాణాలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ చర్యలతో స్థానిక ప్రజల్లో చట్టాల పట్ల అవగాహన పెరగడంతో పాటు, ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారనే స్పష్టమైన సందేశం వెళ్లింది.ప్రభుత్వ భూములపై కన్నేసిన వారికి ఇది గట్టి హెచ్చరికగా నిలిచింది.

# ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు: మంత్రి పొంగులేటి




**ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ**

ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ఈ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిందో వారు సమాధానం చెప్పాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూనే.. కొత్తగా ఆరు గ్యారంటీల హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.**గడప వద్దకే సంక్షేమం :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను నేరుగా పేదల గడప వద్దకే చేరుస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలతో ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు.




గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తోందని చెప్పారు.**రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు :** ఇళ్ల నిర్మాణ విషయంలో గత ప్రభుత్వం పేదలకు కేవలం అబద్ధపు హామీలే ఇచ్చిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.**విద్య, వైద్యానికి అత్యున్నత ప్రాధాన్యం :** ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు తగిన సమాధానం చెప్పారని, ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయచందర్ , ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల



**ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ద్వారా గోదావరి సాగునీరు సరఫరా**

**యాతాలకుంట టన్నెల్ పనులను ఉమ్మడి జిల్లాల కలెక్టర్లలతో కలిసి పరిశీలించి, అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల**

**సత్తుపల్లి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యు న్యూస్) :**సీతారామ ఎత్తిపోతల పథకం యాతాలకుంట టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల జిల్లా కలెక్టర్ లు అనుదీప్ దురిశెట్టి, అంకిత్ లతో కలిసి మంత్రి తుమ్మల విస్తృతంగా పర్యటించారు. సత్తుపల్లి మండలంలో సీతారామ ప్రాజెక్టు క్రింద నిర్మిస్తున్న యాతలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ లు అశ్వారావుపేట ఎమ్మెల్యే లు జారే ఆదినారాయణ లతో కలిసి, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మెయిన్ కెనాల్, 3 పంప్ హౌస్‌లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామన్నారు. సత్తుపల్లి మండలంలోని యాతలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. గోదావరి లో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని అందువబాటులోకి తీసురావాలని సూచించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా మిగిలిన భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు. చిన్న, చిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. యాతాలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్‌లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ కాలువ స్టెబిలైజేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్ జలాలు అందకపోయినా వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా వేంసూరు, దమ్మపేట మండలాలకు కూడా నీరు అందించే అవకాశముందని అన్నారు .నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే సంవత్సరం అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు గోదావరి జలాలు అందించ వచ్చని తెలిపారు. దీంతో మొత్తం 110 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ పూర్తవుతుందని, మెయిన్ కాలువతో పాటు మూడు పంప్ హౌస్‌లను వినియోగించి గోదావరి జలాలను ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలకు సరఫరా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు అందించడమే కాకుండా మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి పినపాక నియోజక వర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్ట్‌ను నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీమా వ్యక్తం చేశారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎసీపీ వసుంధర యాదవ్, మట్టా దయానంద్, ప్రజా ప్రతినిధులు, ఉభయ జిల్లాల ఇంజనీరింగ్, ఇరిగేషన్, పోలీస్, ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మూడుసార్లు అధికారంలోకి వచ్చిన ఆవుకు జాతీయ హోదా ఎందుకు దక్కలేదు

**బీఫ్‌ను విదేశాలకు ఉత్పత్తి చేసే కంపెనీలను మూసివేసే దమ్ము కేంద్ర ప్రభుత్వానికి లేదు**

**గోరక్షకుల ముసుగులో చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోండి..**

**ఆవులను వారసంతల్లోకి తీసుకెళ్లకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం నిర్వహించండి**

**సర్టిఫైడ్ జంతువులను మాత్రమే వారసంతల్లోకి అనుమతించేట్లు చూడాలి**

**జిల్లా కలెక్టర్‌కు, పోలీసు కమిషనర్‌కు.. ఎంఐఎం నేత గులాం అహ్మద్ విజ్ఞప్తి**




**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 22(పిసిడబ్ల్యు న్యూస్):** బిజెపి పార్టీ మూడుసార్లు వరుసగా అధికారంలోకి వచ్చిన పార్లమెంట్లో రెండుసార్లు పూర్తిస్థాయిలో మెజారిటీ ఉన్న ఆవును జాతీయ జంతువుగా ప్రకటిస్తూ పార్లమెంట్లో బిల్లు ఎందుకు పెట్టలేదని, జాతీయ హోదా దక్కేట్లు ఎందుకు కృషి చేయలేదో, బిజెపి నేతలు, కేంద్ర ప్రభుత్వ పెద్దలు, హిందూ సమాజానికి సమాధానం చెప్పాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో సవాల్ చేశారు. దేశం నుంచి గోమాంసాన్ని విదేశాలకు ఉత్పత్తి చేసే మల్టీ నేషనల్ కంపెనీలను మూసివేసే దమ్ము నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. మల్టీ నేషనల్ కంపెనీలను మూసివేసే దమ్ము లేదు కానీ, ఆవు పేరుతో అసత్యాలను ప్రచారం చేస్తూ కేవలం బక్రీద్ మాసం వచ్చిందంటే, ముస్లింలను టార్గెట్ చేయడం బిజెపి నేతలకు అలవాటైపోయిందన్నారు. గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, కావాలని దాష్టీకాన్ని ప్రదర్శించే వారిపై.. చర్యలు తీసుకోవాలని.. వచ్చే నెలలో ఈదుల్ అజ్హా బక్రీద్ పండుగ నిర్వహణకై సహకరించాలని జిల్లా కలెక్టర్కు, పోలీసు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఇప్పటినుంచే జిల్లావ్యాప్తంగా వారసంతల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, ఆవులను వారసంతంలోకి అనుమతించకుండా, ఆవుల క్రయవిక్రయాలు జరగకుండా నిరోధించాలని, దీనిపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అవగాహన సదస్సులు వారసంతల వద్ద ఏర్పాటు చేయాలని, ఫ్లెక్సీలతో ప్రచారాన్ని నిర్వహించాలని కోరారు. బక్రీద్ లో ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులు, చిన్న దూడలు, జింకల వంటివి లేకుండా జాగ్రత్తలు వహించాలని.. ఆరోగ్య కరమైన జంతువులు ఉండేట్లు, ఖచ్చితంగా పశువుల డాక్టర్ ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఉండేట్లు చూసుకోవాలని, చట్ట పరిధిలో ఉంటూ పండుగ జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే పనులు చేయొద్దని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. పశువుల డాక్టర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు వారసంతల్లో అందుబాటులో ఉండేట్లు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. జంతువులు రవాణా చేస్తున్నప్పుడు పోలీసులు ఆపితే వారికి సహకరించాలని, గోరక్షకుల ముసుగులో దుండగులు ఆపినచో తక్షణమే 100కు కాల్ చేయాలని, సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అల్లరి మూకలను ఉక్కుపాదంతో అణచివేయాలని సీపీకి విజ్ఞప్తి చేశారు. ముస్లింల పరంగా తాము ప్రభుత్వానికి, పోలీసులకు ఎల్లవేళలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కానీ గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లో తీసుకొని సోషల్ మీడియాలో అభూత కల్పనలతో కల్పితాలు సృష్టించి, గొడవలకు కారణమయ్యే వారిపై, ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టే మూకల కదలికలపై నిఘా పెట్టి, నియంత్రించాలన్నారు. గతంలో గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, వాహనాలను కొందరు తనిఖీ చేపట్టారని వీరికి వాహనాలను తనిఖీ చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఎవరికైనా ఎలాంటి అభ్యంతరం ఉన్నచో పోలీసులను సహాయం కోరి వారికి నివేదించాలి కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టాలని ప్రయత్నించడం సరికాదన్నారు.

# పరిశుభ్ర నగరంగా ఖమ్మం ఆదర్శం కావాలి

- **విస్తృత రోడ్లు, 24 గంటల త్రాగునీరు, విద్యుత్**
- **రోడ్లు, డ్రైనేజీ, కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
- **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యు న్యూస్) :** విస్తృత రోడ్లు, 24 గంటల త్రాగునీరు, విద్యుత్ తో, శాంతియుత వాతావరణంతో పరిశుభ్రమైన నగరంగా ఖమ్మం ఆదర్శంగా నిలిచేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగర కార్పొరేషన్ ఆర్టీఓ కార్యాలయం వద్ద కోటి 46 లక్షల రూపాయల వ్యయంతో ఆర్టీఓ ఆఫీస్ నుంచి బైపాస్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు, విజయనగర కాలనీలో 50.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఖమ్మం నగరాన్ని విస్తృత రహదారులు, 24 గంటల తాగునీటి సరఫరా, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. శాంతియుత వాతావరణంతో పాటు పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలు ఖమ్మాన్ని ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తానని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి దేవుడు తగిన శక్తి ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. పేదలు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ అవసరమైన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ఖమ్మంకు రింగ్ రోడ్ ఏర్పాటు కానుందని, ట్రాఫిక్ సమస్యలు త్వరలో పరిష్కార మవుతాయని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి డివిజన్‌లో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టి ఖమ్మంను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ.. తుమ్మల అంటేనే అభివృద్ధి అని, ఖమ్మం నగరాన్ని నాలుగు వైపులా సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి డివిజన్‌కు నిధులు కేటాయిస్తూ సమాన అభివృద్ధిని సాధిస్తున్నామని చెప్పారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మంత్రి ఎవరినీ నొప్పించకుండా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యూజీడీ పనులు జరుగుతున్నాయని, వెలుగు మట్ల ప్రాంతంలో ప్రజలకు మెరుగైన పర్యావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. రాబోయే మూడు సంవత్సరాల్లో ఖమ్మం నగరం ఆదర్శ నగరంగా మారుతుందని, మంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ... నేడు రూ.50.85 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మంత్రి మార్గదర్శకత్వంలో నగర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అన్ని డివిజన్లలో రోడ్డు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

# వేసవి వేళ రామ 'సహాయం'

**- 44 గ్రామాల్లో తాగునీటి కష్టాలకు ఎంపీ రఘురాం రెడ్డి చెక్**

**- రూ.35 లక్షల నిధులతో ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు**

**- వారం రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యు న్యూస్) :** వేసవిలో భానుడు భగభగలాడుతుండటంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల (ఎంపిలాండ్స్) నుంచి రూ.35 లక్షలు మంజూరు చేస్తూ తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. **దప్పిక తీర్చే 'ఎంపీ లాడ్స్' :**జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాలోని 44 గ్రామాల్లో రూ.35,20,000 నిధులతో కొత్తగా చేతిపంపులను ఏర్పాటు చేయించనున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా.. ఇప్పటికే కొన్ని ప్రారంభమయ్యాయి. దీనివల్ల వృద్ధులు, మహిళలకు దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకునే కష్టాలు తప్పనున్నాయి. **వారం రోజుల్లోనే పనులు పూర్తి కావాలి :** నిధుల అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను పట్టాలెక్కించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే నిధులు కేటాయించినందుకు స్థానిక సర్పంచ్ లు, ప్రజలు ఎంపీ రఘురాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# బిల్లుపాడు పాఠశాలలో ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు

- కేక్ కటింగ్ విద్యార్థులకు మిఠాయిల పంపిణీ
- వీడ్కోలు కానుకగా వాటర్ బాటిళ్ల అందజేత



తల్లాడ, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) : తల్లాడ మండలం బిల్లుపాడు ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం జి. సరోజిని ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య ప్రతి ఒక్కరికి అవసరమని, పంచిన కొద్దీ పెరిగేది విద్యేనని పేర్కొన్నారు. చదువుతో పాటు సంస్కారం కూడా అవసరమని, సంస్కారం లేని విద్య వ్యర్థమని అన్నారు. బాగా చదివే పాఠశాలల్లో బిల్లుపాడు పాఠశాల ఒకటిగా నిలిచిందని, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రశంసించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది విద్యేనని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. రాబోయే జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, టై, బెల్ట్, షూస్‌తో పాటు విద్యా సామాగ్రి, టిఫిన్, పాలు వంటి సుమారు 25 రకాల సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సెలవుల సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రుల సమక్షంలోనే ఉండాలని, మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. తల్లిదండ్రులకు తెలియకుండా చెరువులు, బావులు, కుంటల్లో ఈతకు వెళ్లరాదని హెచ్చరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్ ప్రసాద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసెఫ్, ఉపాధ్యాయులు కె. ఫ్రాన్సిస్, జి. నాగమణి, ఎం. కళావతి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కేసులో ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ

- ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు బ్రేక్
- కేసీఆర్, హరీశ్‌రావు తదితరులకు తాత్కాలిక ఉపశమనం
- ఖమ్మంలో మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్న బిఆర్ఎస్ నాయకులు
- ధర్మమే గెలిచింది
- పీసీ ఘోష్ కమిషన్‌పై స్టే పట్ల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హర్షం
- బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పండుగ వాతావరణం





ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకల ఆరోపణలపై ఏర్పాటుచేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని, ధర్మమే గెలిచిందని ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ అన్నారు. పీసీ ఘోష్ కమిషన్‌పై స్టే పట్ల, ధర్మమే గెలిచిందని బుధవారం బిఆర్ఎస్ జిల్లా కార్యాలయం ఎదుట బాంబులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మాట్లాడుతూ... నివేదిక ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఉన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. విచారణ కమిషన్ చట్టం కింద పాటించాల్సిన ప్రాథమిక న్యాయపరమైన విధానాలను ఘోష్ కమిషన్ నిర్లక్ష్యం చేసిందని కోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించడం వాస్తవం అన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం నోటీసులు జారీ చేయకుండానే నివేదిక సిద్ధం చేయడం సరైన విధానం కాదని స్పష్టం చేసిందన్నారు. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక తయారు చేయడం అన్యాయమని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి అధికారం ఉన్నప్పటికీ, న్యాయపరమైన ప్రక్రియను తప్పనిసరిగా పాటించాల్సిందేనని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకాలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, కమిషన్ 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ప్రాజెక్టు అమలులో జరిగిన లోపాలకు కేసీఆర్, హరీశ్‌రావు సహా పలువురు అధికారులను బాధ్యులుగా పేర్కొందన్నారు. ఈ నివేదికపై చర్యలకు ముందు న్యాయపరమైన విధానాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి తమ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు సమగ్రంగా పరిశీలించిన ధర్మాసనం, ప్రస్తుతానికి పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టరాదని స్పష్టంగా ఆదేశిస్తూ తీర్పు వెలువరించిందన్నారు. ఈ తీర్పుతో ధర్మమే గెలిచిందని, ఖమ్మం బిఆర్ఎస్ కార్యాలయంలో బాంబులు కాల్చి, రహదారిపై వెళ్తున్న వాహనదారులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్, మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు తాజుద్దీన్, జిల్లా సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, గొట్టిముక్కల శ్రీనివాస్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, వెంకట్, మాటేటి కిరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన భూముల పట్టా ఇతరులకెలా మారింది

- తుమ్మలపై బిఆర్ఎస్ నేతల విమర్శ
- "అపర భగీరథుడు ఎలా?"
- అభివృద్ధి పేరుతో ప్రచారం, వాస్తవం ఎక్కడ?
- అజయ్‌పై విమర్శలు సహించం
- ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తాం







ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్): ఏజెన్సీ ప్రాంత గిరిజన భూములు గిరిజనేతరులకు పట్టాగా ఏ రాజ్యాంగం ప్రకారం మారిందని బిఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్.జె.సి కృష్ణ లుఆరోపించారు. ఖమ్మం తెలంగాణ భవన్‌లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం బుధవారం రాజకీయ వేడిని ప్రతిబింబించింది. నాయకులు ఉప్పల వెంకటరమణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్.జె.సి. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశం గట్టిగా మార్మోగింది. ప్రజా సమస్యలతో పాటు గిరిజన హక్కులు, రైతుల కష్టాలు, నగర అభివృద్ధి అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై బిఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. గిరిజన ప్రాంతాల్లో అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని ప్రస్తావిస్తూ, గిరిజనులకు మాత్రమే చెందాల్సిన భూములు ఎలా ఇతరుల పేరిట నమోదు అయ్యాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బెదిరింపులతో భూములు దురాక్రమణకు గురయ్యాయనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గిరిజన హక్కులు కేవలం చట్టాల్లోనే కాక, నేలమీద కూడా కనిపించాలనే భావనను వారు వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ, మొక్కజొన్న సాగు విస్తీర్ణం, దిగుబడులపై ముందస్తు అవగాహన ఉన్నప్పటికీ సరైన సమయంలో చర్యలు తీసుకోకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, ధాన్యం కొనుగోలు వంటి కీలక అంశాలపై ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకుండా విమర్శలకు దిగడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. "40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న మంత్రి గోదావరి నీటిని ఖమ్మం జిల్లాకు తీసుకురాలేకపోయి 'అపర భగీరథుడు'గా ఎలా మారారు?" అంటూ నేతలు ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో ప్రారంభమైన ప్రాజెక్టులను తమ విజయాలుగా చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. భక్తరామదాసు, సీతారామ ప్రాజెక్టుల ప్రస్తావనతో పాటు దుమ్ముగూడెం ఆనకట్టపై చేసిన వ్యాఖ్యలను కూడా తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలను తిప్పికొడుతూ, చట్టబద్ధంగా క్రమబద్ధీకరించిన భూములను ఆక్రమణగా చూపించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని అన్నారు. పేదలకు సహాయం చేసే కార్యక్రమాలపై విమర్శలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. "అజయ్‌పై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఖమ్మం నగర అభివృద్ధి విషయానికొస్తే, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ సహకారంతో పువ్వాడ అజయ్‌కుమార్ నాయకత్వంలోనే ముఖ్యమైన ప్రాజెక్టులు అమలయ్యాయని గుర్తుచేశారు. మున్నేరు రిటైనింగ్ వాల్, తీగల వంతెన వంటి పనులకు ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన అభివృద్ధి ఏదీ కనిపించడంలేదని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడం, భయపెట్టే రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రతిపక్షాల విమర్శలతో ప్రజల సమస్యలను వినడం, పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ, "ప్రజా సమస్యలపై మా పోరాటం ఆగదన్నారు. పువ్వాడ అజయ్‌కుమార్ నాయకత్వంలో ఖమ్మం అభివృద్ధి, ప్రజల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

# ప్రధాని మోడీపై ఖర్గే అనుచిత వ్యాఖ్యలు శోచనీయం

- ఖమ్మంలో భగ్గుమన్న బీజేపీ శ్రేణులు
- మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు హెచ్చరిక



ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ దుమారాన్ని రేపాయి. ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో, స్థానిక 1 టౌన్ అధ్యక్షులు నరేష్ గాడిల అధ్యక్షతన నగరంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద బీజేపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, మల్లికార్జున ఖర్గేకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ఖర్గే దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రధానిపై నోటిదురుసుగా ప్రవర్తించడం కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ... మల్లికార్జున ఖర్గే తన స్థాయిని మర్చిపోయి తెలివి తక్కువ ప్రేలాపనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిపై ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఆయన విమర్శించారు. రాజకీయం అనేది ఎప్పుడూ గౌరవప్రదంగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రధాని మోడీపై దేశ ప్రజలు చూపిస్తున్న అపరిమితమైన అభిమానాన్ని చూసి తట్టుకోలేక, ఆ అక్కసుతోనే కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ఖర్గే తన వ్యాఖ్యలకు గాను వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఖమ్మం జిల్లా శాఖ తరఫున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, రుద్ర ప్రదీప్ లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు నిరంతరం మోడీపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని పెంచిన ప్రధానిని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమేనని వారు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా, రవి రాథోడ్ లు మాట్లాడుతూ.. ఇటువంటి వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ పతనాన్ని కొనితెచ్చుకుంటోందని ఎద్దేవా చేశారు. దళిత మోర్చా నాయకులు కోటమర్తి సుదర్శన్, రేగన్ ప్రతాప్ బండ్ల మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రధానిపై విమర్శలు చేయడం ఖర్గే అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద జరిగిన ఈ నిరసనలో జిల్లా నాయకులు బోయినపల్లి సురేష్, మందడపు సుబ్బారావు, మేకల నాగేందర్, మార్తి ప్రసాద్, బోయినపల్లి శేఖర్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. పొట్టిమూతి జనార్దన్, పిల్లలమర్రి వెంకట్, డీకొండ శ్యామ్, మేడ సంపత్, అనగాని రామారావు లు మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలు తమ భాషను అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అర్బన్ అధ్యక్షులు వాకదాని రామకృష్ణ నేతృత్వంలో పట్టణ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నిరసన కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు పాలేపు రాము, పొట్టిమూతి వాణి, తుమ్మ ఇందు, ఊరుకొండ ఖాదర్ కూడా ప్రసంగించారు.

వీరు మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు మోడీ నాయకత్వం పట్ల ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని, దానిని దెబ్బతీయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. రుద్రగాని మాధవ్, బాజోజు కుమార్ తదితరులు కూడా పాల్గొని మల్లికార్జున ఖర్గే తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు తమ నోటిదురుసును ప్రదర్శించడం మానుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తారని నాయకులు హెచ్చరించారు.

# పారదర్శకంగా బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

- 133 మంది పోలీసులకు బదిలీలు




కర్నూలు ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) : సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లాలోని పోలీసు స్టేషన్ లలో ఒకే చోట 5 ఏళ్ళు సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జరిగిన బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ కు మొత్తం 133 మంది హజరయ్యారు. ఇందులో 15 మంది ఎఎస్సైలు, 25 మంది హెడ్ కానిస్టేబుల్స్ ,93 మంది కానిస్టేబుల్స్ ఉన్నారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ పోలీసు సిబ్బందితో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ఒకే పోలీసుస్టేషన్ లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోలీసులకు నిబంధనల ప్రకారం పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టామన్నారు. గతంలో పని చేసిన పోలీసుస్టేషన్ లు కాకుండా , తమ స్వంత మండలం, నియోజకవర్గం మినహాయించి, ఇతర పోలీసు స్టేషన్లు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఖాళీల ఆధారంగా ఉన్న పోలీసు స్టేషన్ ల ను ఎంచుకోవాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా సంతృప్తికర బదిలీలతో మరిశీత భాధ్యతగా పని చేయాలన్నారు. పోలీసు సిబ్బందికి కోరుకున్న చోటుకే బదిలీలు జరగడంతో బదిలీల పట్ల పోలీసు సిబ్బంది అందరూ ఆనందం వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బందిని కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయడంతో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఎస్పీ కి పోలీసు సిబ్బంది తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, డిపిఓ ఎఓ విజయలక్ష్మి , డిపిఓ సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలి

**- జూన్ మొదటి వారానికి బైపాస్‌కేబుల్ బ్రిడ్జ్ మధ్య రిటైనింగ్ వాల్ పూర్తి చేయాలి**

**- మొక్కజొన్న 2.17 లక్షల టన్నులు, వరి 2,37,500 టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా వేగవంతం చేయాలి**

**- 92 కోట్లతో 20 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్ ప్రతిపాదనలు 50 శాతం కేంద్ర నిధుల సమీకరణకు చర్యలు**

**- ఎస్టీపీ, యూజీడీ, రోప్‌వే అవసరమైన పనులు వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలి**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. పౌర సరఫరాలు, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, పంటల కొనుగోలు, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రగతి, ఖమ్మం నగర కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పంటల కొనుగోళ్లు, నగర అభివృద్ధి పనులను ఎటువంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ మొదటి వారానికి బైపాస్ నుంచి కేబుల్ బ్రిడ్జ వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తవ్వాలని, చిన్న గ్యాప్ కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, క్రీడాకారుల వసతి గృహాలు, అతిథి గృహం, కన్వెన్షన్ హాల్ వంటి సదుపాయాలతో 20 ఎకరాల్లో 92 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కనీసం 50 శాతం కేంద్ర నిధులు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని, 200 మంది క్రీడాకారులకు వసతి కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అత్యున్నత నాణ్యతతో నిర్మించబడిందని, దానికి సరైన నిర్వహణ, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి త్వరలోనే క్రీడా కార్యక్రమాలు ప్రారంభించా లని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు నిర్వహించి ఘనంగా ప్రారంభోత్సవం చేయాలని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో రోడ్ డివైడర్ అధిక స్థలం ఆక్రమిస్తోందని, భవిష్యత్తులో మార్పులు చేయాలని, ఆకర్షణీయమైన మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ధంసలాపురం ఎస్టీపీ స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే నిర్మాణంలో వర్షాల వల్ల పనులు ఆగకుండా అవసరమైన పనులు వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని, ఈ నెలలో బేస్‌మెంట్ పనులు పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ అభివృద్ధి పనులు, పంటల కొనుగోళ్లు సమాంతరంగా జరగాలని, మార్కెట్ కాంపౌండ్ వాల్, మిగిలిన షెడ్లు ఈ నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో



ఉండేలా చర్యలు తీసుకోవాలని, సోలార్ పవర్ వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, విక్రయం అంశాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. వరదల సమయంలో మార్కెట్‌లో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంటల కొనుగోళ్లపై మంత్రి మాట్లాడుతూ.. ఏ కేంద్రంలోనూ గన్నీ బ్యాగుల కొరత రాకూడదని, అవసరమైన చోట అదనపు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, పీఏసీఎస్‌లలో డిమాండ్ మేరకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిల్వ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరి కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని, ఇతర జిల్లాలతో సమన్వయం చేసుకుని వరి తరలింపులు చేపట్టాలని సూచించారు. జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ పెంచి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, 4 లక్షల 34 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండగా 2.17 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 39 వేల టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో 72 వేల టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని తెలిపారు. 2,37,500 మెట్రిక్ టన్నుల వరి కొనుగోళ్లకు 308 కేంద్రాలు ప్రతిపాదించగా, 240 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. 45 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. టీయూఎఫ్ఐడీసీ క్రింద 66 పనులు మంజూరు కాగా 63 పూర్తయ్యాయని, మిగిలిన 3 పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. సింథటిక్ ట్రాక్‌ను 5 లేయర్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించామని చెప్పారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో రోడ్డు, డివైడర్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ధంసలాపురం ఎస్టీపీ స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ అభివృద్ధి పనులు జూలై చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మే నెలలో వేగంగా పనులు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

# కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

**స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన**

**ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు**

**వాషింగ్టన్,ఏప్రిల్22:** ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్ ్‌÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్‌్÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి



అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.

# సైబర్ నేరాలు పురుగుతున్న వేళ



**బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం**

**ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జన్నార్ లేఖ**

**హైదరాబాద్,ఏప్రిల్22:** సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గో÷-డలెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.